http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 22 డిసెంబర్ 2024

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad




## రాష్ట్రంలో
# నో బెనిఫిట్ షో!

**పోలీసులు వద్దన్నా హీరో వచ్చారు : సీఎం రేవంత్ రెడ్డి**





- 'ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటానికి మేం ఒప్పుకోం
- మేం అధికారంలో ఉన్నంతకాలం అలాంటి ఆటలు సాగవు'
- సంధ్య థియేటర్ ఘటనపై అసెంబ్లీలో చర్చ
- స్వయంగా ప్రకటన చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఘటనపై పోలీసుల విచారణ జరుగుతోందన్న సీఎం రేవంత్

*"నేరుగా థియేటర్‌కు వచ్చి సినిమా చూసి వెళ్లిపోతే ఈ ఘటన జరిగేదే లేదో నాకు తెలీదు. ఎక్స్‌రోడ్డు చౌరస్తా ముందే నుంచి రూఫ్‌టాఫ్ ద్వారా రోడ్ షో చేస్తూ థియేటర్‌కు వచ్చారు. ఆ సమయంలో చుట్టూ ఉన్న ఏడెనిమిది థియేటర్లలో ఉన్న అభిమానులు ఇక్కడికే వచ్చారు. హీరో కారు లోపలకు పంపించేందుకు గేటు తెరిచారు. హీరోను కలిసేందుకు వేలాదిగా ఒకేసారి థియేటర్‌వైపు వచ్చారు. ఆ సమయంలో జరిగిన ఘటనలో రేవతి చనిపోయారు. హీరోను చూడాలి.. కలవాలని అభిమానులు రావడంతో.. హీరో సిబ్బంది నెట్టివేయడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో తల్లి చనిపోయింది.. కుమారుడు చికిత్స పొందుతున్నాడు. ఘటన జరిగిన వెంటనే తల్లి, కుమారుడిని రక్షించేందుకు పోలీసులు యత్నించారు.'*

## పుష్ప-2 సినిమాతో ఆఖరు...

- అవన్నీ ఆపేస్తున్నాం: మంత్రి కోమటిరెడ్డి
- కిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన మంత్రి కోమటిరెడ్డి
- చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ కు పరామర్శ
- అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి
- ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని వెల్లడి

## పంచాయతీ ఎన్నికల నిబంధనలు
# యధాతథం!

- ఇద్దరు పిల్లలకు మించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన తెలంగాణలో కొనసాగింపు
- ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను తిరస్కరించిన రాష్ట్ర మంత్రి మండలి
- తెలంగాణలో సంతానోత్పత్తి రేటు పై శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణంతో ఈ ప్రతిపాదనను నిరాకరించినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్

ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన తెలంగాణలో కొనసాగనుంది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి మండలి తిరస్కరించింది.
పాత నిబంధననే కొనసాగించాలని పంచాయతీ రాజ్ ను ఆదేశించింది. - మిగతా3లో







## మధ్యతరగతికి మళ్లీ జీఎస్టీ బాదుడు

- ఈ వస్తువులపై ట్యాక్స్ పెంపు!
- పలు వస్తువులపై జీఎస్టీ పెరగనుంది.
- మధ్య తరగతి ప్రజలకు మరింత భారం కానుంది
- ఈ జీఎస్టీ పెంపుతో వివిధ రకాల వస్తువులకు ధరలు

# రైతులే ఆదర్శం

- రైతు భరోసాపై సీఎం హామీ
- రైతు భరోసా.. రైతులను ఆదుకునేందుకే
- రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించింది
- రైతుభరోసా అమలు విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు



హైదరాబాద్

తెలంగాణలో రైతు భరోసా అమలుపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. ఈ పథకాన్ని నిలిపేస్తారని ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై బీఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు .రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా అంశంపై శాసనసభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రధాన ప్రతిపక్షం సలహాలు తీసుకుని విధివిధానాలను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. రైతు భరోసా.. రైతులను ఆదుకునేందుకేనని.. రైతుభరోసా అమలు విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని తేల్చి చెప్పారు.రైతులను ఆదుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. భూమినే నమ్ముకుని, భూమిని అమ్మగా భావించిన రైతులను ఆదుకోవాలనేదే మా ఆలోచన. రైతు బంధు ఉద్దేశం పెట్టుబడి సాయం. పెట్టుబడి సాయం ఎవరికి ఉండాలి? - మిగతా3లో

## 24న దేశవ్యాప్త కాంగ్రెస్ నిరసన

- అమిత్‌షా వ్యాఖ్యలపై కొనసాగిస్తున్న నిరసనలను మరింత తీవ్రతరం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది
- అమిత్‌షా వ్యాఖ్యలపై పార్టీ ఎంపీలు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు డిసెంబర్ 22, 23 తేదీల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు
- దేశంలోని అన్ని జిల్లాల్లోనూ 'బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్' నిర్వహించాలని కోరుతూ పార్టీ నేతలందరికీ ఒక సర్క్యులర్ జారీ



## మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం

- కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి ఎల్జీ అనుమతి..!
- మనీలాండరింగ్ కేసులో కేజ్రీని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చినట్లు సమాచారం.
- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



# మధ్యతరగతికి మళ్లీ జీఎస్టీ బాదుడు

జీఎస్టీ కౌన్సిల్ 55వ సమావేశం జైసల్మేర్‌లో జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. మీరు పాత కారును విక్రయించాలని ఆలోచిస్తున్నట్లయితే, మీకు ఇప్పుడు పెరుగుదల ఉంటుంది. వినియోగించిన వాహనాల విక్రయంపై ప్రభుత్వం జీఎస్టీ రేటును పెంచడంతో పాటు టిక్కెట్లు కొనుగోలు చేయడమే కాకుండా పాప్‌కార్న్ కొనుగోలుకు కూడా ఎక్కువ డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.




**పాప్‌కార్న్ ఖరీదైనది:**
ఫోర్టిఫైడ్ రైస్‌పై పన్ను విధానాన్ని సరళీకృతం చేసి, దానిపై 5% జీఎస్టీ విధించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. అదే సమయంలో రెడీ-టు-ఈట్ పాప్‌కార్న్‌పై పన్ను రేట్ల గురించి పూర్తి వివరాలు విడుదలయ్యాయి. సాధారణ ఉప్పు, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పాప్‌కార్న్‌పై ప్యాకేజింగ్, లేబుల్ లేకుండా 5% జీఎస్టీ వసూలు చేయనున్నారు. అదే సమయంలో ప్యాకేజింగ్, లేబులింగ్ చేసేటప్పుడు రేటు 12% ఉంటుంది. చక్కెర వంటి పంచదార పాప్‌కార్న్‌ను "స్వీట్ డిష్" విభాగంలో ఉంచారు. 18% జీఎస్టీకి లోబడి ఉంటుంది.

**పాత వాహనాలపై జీఎస్టీ పెంపు:**
ఎలక్ట్రిక్ వాహనాలతో సహా పాత, ఉపయోగించిన వాహనాల విక్రయాలపై జీఎస్టీ రేటు 12% నుండి 18% కి పెరిగింది. అయితే బీమా విషయంలో నిర్ణయం తీసుకోవడం ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయంపై %+శీవీ% సమావేశం అంగీకరించలేదు. తదుపరి పరిశీలన కోసం పంపించారు.

**148 పదార్థాలపై ప్రతిపాదిత మార్పులు:**
వివిధ వస్తువులపై పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని %+ూవీ% సిఫార్సు చేసింది. హానికరమైన పానీయాలు, పొగాకు ఉత్పత్తులపై పన్ను రేటును 28% నుంచి 35%కి పెంచాలని ప్రతిపాదించింది. అదేవిధంగా దుస్తులపై ప్రతిపాదిత కొత్త రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి.
రూ. 1,500 వరకు ఉన్న దుస్తులపై 5% జీఎస్టీ
రూ.1,500 నుండి రూ.10,000 వరకు వస్త్రాలపై 18% జీఎస్టీ.
రూ.10,0 కంటే ఎక్కువ విలువైన బట్టలపై 28% జీఎస్టీ
రూ.1,500 పైబడిన షూస్, రూ.25,000 పైబడిన వాచీలపై పన్ను రేటును 18% నుంచి 28%కి పెంచాలని సిఫార్సు చేసింది.

**జీఎస్టీని తగ్గించాలనే ప్రతిపాదన:**
నిత్యావసర వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించాలని కూడా జీఓఎం సిఫార్సు చేసింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (20 లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ)పై జీఎస్టీని 18% నుంచి 5%కి తగ్గించాలని ప్రతిపాదించారు. అదనంగా, రూ. 10,000 కంటే తక్కువ ఉన్న సైకిళ్లు, క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ రేట్లను 12% నుండి 5%కి తగ్గించాలని సిఫార్సు చేసింది.

# 24న దేశవ్యాప్త కాంగ్రెస్ నిరసన

**న్యూఢిల్లీ:** భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. అమిత్‌షా వ్యాఖ్యలపై కొనసాగిస్తున్న నిరసనలను మరింత తీవ్రతరం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబర్ 24న దేశవ్యాప్తంగా ఆ పార్టీ నిరసనలను చేపట్టనుంది. అమిత్‌షా వ్యాఖ్యలపై పార్టీ ఎంపీలు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు డిసెంబర్ 22, 23 తేదీల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. దేశంలోని అన్ని జిల్లాల్లోనూ 'బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్' నిర్వహించాలని కోరుతూ పార్టీ నేతలందరికీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసీ వేణుగోపాల్ ఒక సర్క్యులర్ జారీ చేశారు. అంబేద్కర్ విగ్రహాలకు పుష్పమాలలు వేసి మార్చ్ ప్రారంభించాలని, జిల్లా మెజిస్ట్రేట్లకు మెమొరాండం సమర్పించేంత వరకూ మార్చ్ కొనసాగించాలని ఆయన సూచించారు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొంటారు.



**పార్లమెంటులో రగడ**
ఈనెల 20వ తేదీతో పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా కేంద్ర మంత్రి అమిత్‌షా డిసెంబర్ 18న రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అంబేద్కర్ పేరును పదేపదే ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఒక ఫ్యాషన్‌గా మారిందని షా విమర్శించారు. దేవుడి పేరు పదేపదే వల్లె వేస్తే స్వర్గమైనా దొరుకుతుందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అంబేద్కర్‌ను అవమానించినందుకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. పార్లమెంటు వెలుపల వినూత్న రీతిలో రోజువారీ నిరసనలకు దిగింది. ఈ క్రమంలోనే పార్లమెంటు ఆవరణలో ఎంపీల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్‌లు గాయపడ్డారు. పార్లమెంటుకు వెళ్తుండగా తనను కూడా గెంటినట్టు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇరువర్గాల వారు పార్లమెంటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు చేశారు.

# కువైట్ చేరుకున్న ప్రధాని మోదీకి







భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక పర్యటన కోసం శనివారం (డిసెంబర్ 21) కువైట్ చేరుకున్నారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ గల్ఫ్ దేశాల నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. కువైట్ చేరుకున్న వెంటనే ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. అనంతరం కువైట్ సిటీలో మాజీ ఐఎఫ్ఎస్ అధికారి 101 ఏళ్ల మంగళ్ సేన్ హండాను కూడా ప్రధాని మోదీ కలిశారు.

ప్రధాని మోదీ కువైట్ రాకతో అక్కడ నివసిస్తున్న ప్రవాసాంధ్రుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రధాని నరేంద్ర మోదీ రాక గర్వించదగిన క్షణం. ఇది భారతీయుల పెద్ద విజయం అంటూ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం విశేషం. గతంలో ఇందిరా గాంధీ కువైట్‌లో పర్యటించారు. భారతదేశం- కువైట్ మధ్య సంబంధాలు స్నేహపూర్వకంగా ఉన్నాయి. రక్షణ, భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడం ఈ పర్యటనలో ప్రధానాంశంగా ఉంటుందని భారత అధికారులు తెలిపారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం, రక్షణ సహకార ఒప్పందం కోసం కువైట్‌తో చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. కువైట్ పర్యటనలో ప్రధాని మోదీ, అబ్దుల్లా అల్ బరూన్, అబ్దుల్ లతీఫ్ అల్ నెసెఫ్‌లను కలిశారు. అబ్దుల్లా అల్ బరూన్ అరబిక్‌లో రామాయణం, మహాభారతాలను అనువదించారు. అబ్దుల్ లతీఫ్ అల్ నెసెఫ్ రామాయణం, మహాభారతం అరబిక్ వెర్షన్‌లను ప్రచురించారు. మన్ కీ బాత్‌లో కూడా వీరి ప్రయత్నాల గురించి ప్రధాని మోదీ ప్రశంసించారు.

**అరబిక్ భాషలో రామాయణం, మహాభారతం.. కువైట్‌లో బుక్స్ రిలీజ్**
భారతీయ ఇతిహాస గ్రంథాలు రామాయణం , మహాభారతం పుస్తకాలను అరబిష్ భాషలో తర్జుమా చేశారు. ఆ ట్రాన్స్‌లేట్ చేసిన పుస్తకాలను కువైట్‌లో ఇవాళ ప్రచురణకర్తలు ప్రదర్శించారు. ప్రధాని మోదీ కువైట్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో.. ఆ రెండు బుక్స్‌ను పబ్లిషర్స్ మీడియాకు ప్రజెంట్ చేశారు. రామాయణం, మహాభారత గ్రంథాలను అరబిక్ భాషలో రాసేందుకు రెండు ఏళ్లు పట్టినట్లు బుక్ పబ్లిషర్స్ పేర్కొన్నారు. రెండు పుస్తకాల నుంచి భారతీయ సంస్కృతిని అర్థం చేసుకున్నట్లు ట్రాన్స్‌లేటర్ తెలిపారు.



## మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం..



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్ తగిలింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసులో డిసెంబర్ 5న మాజీ సీఎంను విచారిచేందుకు ఈడీ అనుమతి కోరగా.. అందుకు ఎల్జీ తాజాగా పర్మిషన్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఎల్జీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసినట్లు సదరు వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబర్ 13న సీబీఐ కేసులోనూ కేజ్రీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14వ తేదీన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఈడీ మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్ధమవుతోంది.

## రష్యాలోని ఎత్తైన భవనాలపై డ్రోన్ దాడులు.. వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లపై దాడిని తలపించిన దృశ్యాలు



**మాస్కో:** రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లు రష్యాలోని ఎత్తైన భవనాలను ఢీకొట్టి పేలాయి. 2001లో న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లను విమానాలు ఢీకొన్న సంఘటనను ఈ దాడి తలపించింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శనివారం ఉదయం రష్యాలోని కజాన్ నగరంపై డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసింది. రెండు ఎత్తైన భవనాలను రెండు డ్రోన్లు ఢీకొని పేలిపోయాయి. మంటలు చెలరేగడంతో నల్లటి పొగలు దట్టంగా వ్యాపించాయి. కాగా, ఎత్తైన ఆయా భవనాల్లోని నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించినట్లు రష్యా మీడియా తెలిపింది. అయితే ఉక్రెయిన్ డ్రోన్ల దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని పేర్కొంది. ఈ సంఘటన నేపథ్యంలో కజాన్ విమానాశ్రయంలో విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించింది. మరోవైపు 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోని ట్విన్ టవర్లపై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులు చేశారు. హైజాక్ చేసిన విమానాలతో ఎత్తైన టవర్ బిల్డింగ్‌లను ఢీకొట్టారు. దీంతో దట్టంగా మంటలు, పొగలు వ్యాపించాయి. అయితే డిసెంబర్ 21న రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి 9/11 ఉగ్రదాడిని తలపించింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## 3వ రోజుల డౌన్ ట్రెండ్




**ముంబై :** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంనే సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. బంగారం, వెండి ధరల్లో నిత్యం మార్పులు జరుగుతూనే ఉంటాయి. ఈ క్రమంలో ఓసారి ధరలు పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతుంటాయి. గత కొన్ని రోజులుగా క్రితం భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా గోల్డ్, సిల్వర్ ధర భారీగా తగ్గింది. ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.300లు తగ్గి రూ.70,390లకు చేరుకుంది. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 330లు తగ్గి రూ.76,790లకు చేరుకుంది. వెండి కిలో ధర నిన్నటితో పోల్చితే రూ. 1,000లు తగ్గి రూ.98,900లుగా ఉంది.
దేశంలోని ప్రధాన నగరాల్లో గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..

**బంగారం ధరలు..**
హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.70,390లు కాగా, 24 క్యారెట్ల ధర రూ.76,790లుగా ఉంది.
విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.70,390, 24 క్యారెట్ల ధర రూ.76,790లుగా ఉంది.
ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,540లు కాగా, 24 క్యారెట్ల ధర రూ.76,940లుగా ఉంది.
ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.70,390లు కాగా, 24 క్యారెట్ల ధర రూ.76,790లుగా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల రేట్ రూ.70,390లుకాగా, 24 క్యారెట్లు రూ.76,790 లుగా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.70,390లు కాగా, 24 క్యారెట్ల ధర రూ.76,790లుగా ఉంది. వెండి ధరలు.. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.97,900లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో రూ.97,900లుగా ఉంది.
ఢిల్లీలో వెండి కిలో ధర రూ.92,400లు కాగా, ముంబైలో రూ.90,400, బెంగళూరులో రూ.90,400, చెన్నైలో రూ.97,900 లుగా ఉంది.

# రైతులే ఆదర్శం..

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వం పదేళ్లలో రూ.72,817 కోట్లు రైతు బంధు రూపంలో ఖర్చు చేసింది. సాగులో లేని భూములకు, గుట్టలు, లే-అవుట్లకు, నేషనల్ హైవేస్‌కు కూడా రైతు బంధు ఇచ్చారు. రూ.72,817 కోట్లలో దాదాపు రూ.22వేల కోట్లు అనర్హులకు ఆయాచిత లబ్ధి చేకూర్చారు' అని సీఎం వివరించారు.



**రాళ్లకు.. గుట్టలకు ఇద్దామా..**

'ఇప్పుడు కూడా రాళ్లకు, గుట్టలకు, రహదారులకు మనం రైతు భరోసా ఇద్దామా? గతంలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ రహదారి కూడా రైతు బంధు ఇచ్చారు. ఆమన్ గల్ ప్రాంతంలో శ్రీశైలం రోడ్లకు కూడా ఇచ్చారు. క్రషర్ యూనిట్లకు, మైనింగ్ భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు. వాళ్ల అనుయాయులు కొందరు నకిలీ పట్టాల ద్వారా కూడా రైతు బంధు పొందారు. హైదరాబాద్ చుట్టుపక్కల 50కి.మీ పరిధిలో 70 నుంచి 80 శాతం వ్యవసాయం చేయడం లేదు. కానీ గతంలో హైదరాబాద్ చుట్టుపక్కల 3 కోట్ల ఎకరాలకు డబ్బులు ఇచ్చుకుంటూ వెళ్లారు' అని రేవంత్ రెడ్డి వివరించారు.'రైతు బంధు రూపంలో వేలాది కోట్లు కొల్లగొట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేథస్సుతో రైతు భరోసాపై ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సూచనలు ఇస్తారని మేం భావించాం. చివరి పేద వాడికి కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు అందజేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. వాళ్లు ఇచ్చారు కాబట్టి మమ్మల్ని అందరికీ ఇవ్వాలంటున్నారు. వాళ్ళను ఆదర్శంగా తీసుకోమంటున్నారు. వాళ్ళను ఆదర్శంగా తీసుకుంటే వాళ్లలాగే మేం ఇక్కడ ఉండం' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**రైతులే ఆదర్శం..**

'మాకు రైతులు ఆదర్శం.. రైతు సంక్షేమమే మాకు ముఖ్యం. సభలోకి వస్తే సమాజం ముందు తల దించుకోవాల్సి వస్తుందనే ఆలోచనతో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదేమో. రాళ్ల రప్పలు, గుట్టలు, రియల్ లే అవుట్లకు, నేషనల్ హైవేలకు రైతు భరోసా ఇద్దామా? ప్రతిపక్షంగా ఒక స్పష్టమైన సూచన ఇవ్వండి. మీ సూచనలు సహేతుకమైతే మేం వినడానికి సిద్ధంగా ఉన్నాం' అని రేవంత్ స్పష్టం చేశారు.'2019లో నేను పార్లమెంటులో రైతు ఆత్మహత్యలపై అడిగిన ప్రశ్నకు సభలో సమాధానం ఇచ్చారు. 2014, 2015, 2016 కు సంబంధించి రైతు ఆత్మహత్యలపై సభలో సమాధానం ఇచ్చారు. ఏపీలో 2014లో 160, 2015లో 516, 2016లో 239 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మహారాష్ట్రలో దేశంలోనే అత్యధికంగా 2014లో 2568, 2015లో 3030, 2016లో 2550 రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వాళ్ల ఏలుబడిలో తెలంగాణ రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉంది. తెలంగాణలో 2014లో 898, 2015లో 1358, 2016లో 632 రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**సిగ్గుచేటు..**

'మనకంటే అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇన్ని ఆత్మహత్యలు జరగలేదు. ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రంలో ఇన్ని ఆత్మహత్యలు జరగడం సిగ్గుచేటు. వాళ్లు తల దించుకుని రైతులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. గొప్పలు చెప్పుకుంటున్నారు. రైతులకు వాస్తవాలు తెలుసు కాబట్టే వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టారు. ఏడాదిలో మేం ఏం చేశామని ఇన్నిసార్లు అడుగుతున్నారు.. పదేళ్లలో మీ హయాంలో ఏం జరిగిందో వెనక్కి తిరిగి చూసుకోండి. ఐదేళ్లలో లక్ష రూపాయల రుణమాఫీకి వాళ్లు ఖర్చు చేసింది రూ.16,143 కోట్లు. అది కేవలం మిత్తికే సరిపోయింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక వీళ్లు చేసిన రుణమాఫీ రూ.11, 909 కోట్ల 31 లక్షలు మాత్రమే' అని ముఖ్యమంత్రి వివరించారు.'మీరు చేసిన రుణమాఫీ కేవలం రూ.3384 కోట్లు మాత్రమే... ఇదీ మీ చరిత్ర. పదేళ్లలో వారు చేసిన రుణమాఫీ రూ.27వేల కోట్లు. 27 రోజుల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి ఏడాదిలోనే 25,35,963 రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేసి మా ప్రభుత్వం రైతుల రుణం తీర్చుకుంది. ఇది మా గొప్పతనంగా మేం అనుకోవడంలేదు. ఇది మా బాధ్యతగా భావిస్తున్నాం. మాట తప్పని, మడమ తిప్పని పార్టీ కాంగ్రెస్. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ. సోనియా దగ్గరికి వెళ్లి బొక్కబోర్ల పడిన సంగతి మరిచిపోయారు. కృతజ్ఞత లేని మనుషులు వాళ్లు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు.

# రాష్ట్రంలో నో బెనిఫిట్ షో!

'సినిమాలు తీసుకోండి.. వ్యాపారం చేసుకోండి.. డబ్బులు సంపాదించుకోండి.. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి.. షూటింగ్‌కు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి.. కానీ ప్రజల ప్రాణాలు పోతుంటే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు" అని సినిమా ప్రముఖులకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరికలు పంపారు. తాను కుర్చీలో ఉన్నంత వరకు ఇలాంటి ఘటనలు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండవని తేల్చి చెప్పారు. అసెంబ్లీలో సీఎం రేవంత్? రెడ్డి సంధ్య థియేటర్ ఘటనపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈనెల 4న పుష్ప -2 విడుదలవుతుందని, అదే రోజు హీరో, హీరోయిన్, సినీ నిర్మాణ సిబ్బంది వస్తారని బందోబస్తు కావాలని సంధ్య థియేటర్ యాజమాన్యం ఈనెల 2న చిక్కడపల్లి పీఎస్‌లో దరఖాస్తు చేశారని చెప్పారు. ఈనెల 3న థియేటర్? రాసిన లేఖకు పోలీసులు రాతపూర్వక సమాధానం ఇచ్చారన్నారు.

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈనెల 4న పుష్ప -2 విడుదలవుతుందని, అదే రోజు హీరో, హీరోయిన్, సినీ నిర్మాణ సిబ్బంది వస్తారని బందోబస్తు కావాలని సంధ్య థియేటర్ యాజమాన్యం ఈనెల 2న చిక్కడపల్లి పీఎస్‌లో దరఖాస్తు చేశారని చెప్పారు. ఈనెల 3న థియేటర్ రాసిన లేఖకు పోలీసులు రాతపూర్వక సమాధానం ఇచ్చారన్నారు."

సంధ్యా థియేటర్?కు వెళ్లి, రావడానికి ఒకే మార్గం ఉందని, చుట్టు పక్కల ఇతర థియేటర్లు, రెస్టారెంట్లు ఉన్నాయని అందులో తెలిపారని వివరించారు. సంధ్య థియేటర్? పరిసరాల పరిస్థితుల దృష్ట్యా సెలబ్రిటీలకు భద్రత ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారని సీఎం అసెంబ్లీలో వెల్లడించారు. వచ్చే జనాలను నియంత్రించడం సాధ్యం కాదని చెప్పారని సభలో సీఎం రేవంత్? రెడ్డి పేర్కొన్నారు.

పోలీసులు వద్దన్నా హీరో వచ్చారు : సంధ్య థియేటర్? యాజమాన్యం ఇచ్చిన లేఖను తిరస్కరించామని సీఎం రేవంత్? రెడ్డి సభలో చెప్పారు. ఈనెల 2న సంధ్య థియేటర్? యాజమాన్యం లేఖ ఇస్తే 3న తిరస్కరించామన్నారు. అయినా వాహనం రూఫ్?టాఫ్? నుంచి చేతులు ఊపుతూ ర్యాలీ చేశారన్నారు. హీరో, హీరోయిన్?, ప్రొడ్యూసర్? థియేటర్?కు రావొద్దని అప్పుడే చెప్పామన్నారు. కానీ పోలీసులు దరఖాస్తు తిరస్కరించినా రాత్రి 9.30 గంటల సమయంలో హీరో థియేటర్?కు వచ్చారని సీఎం వివరాలు వెల్లడించారు. నేరుగా థియేటర్?కు వచ్చి సినిమా చూసి వెళ్లిపోతే ఈ ఘటన జరిగేదే లేదో నాకు తెలియదని సీఎం చెప్పారు. ఎక్స్? రోడ్డు చౌరస్తా ముందే నుంచి రూఫ్?టాఫ్? ద్వారా రోడ్? షో చేస్తూ థియేటర్?కు వచ్చారని పేర్కొన్నారు. ఆ సమయంలో చుట్టూ ఉన్న ఏడెనిమిది థియేటర్లలో ఉన్న అభిమానులు ఇక్కడికే వచ్చారన్నారు. దీంతో హీరో కారు లోపలకు పంపించేందుకు గేటు తెరిచారన్నారు.

ఏసీపీ చెప్పినా వినలేదు : థియేటర్ సిబ్బంది తీరుపై ఆగ్రహించి చివరకు హీరో వద్దకు వెళ్లారని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. థియేటర్ బయట ఉన్న వేలాదిమందిని అభిమానులను నియంత్రించలేక శాంతిభద్రతలు చేజారిపోయాయని చెప్పారన్నారు. థియేటర్ నుంచి వెళ్లిపోవాలని హీరోను ఏసీపీ కోరారన్నారు. సినిమా పూర్తయ్యేంతవరకు ఉంటానని హీరో చెప్పినట్లు సిటీ కమిషనర్ నాతో చెప్పారని సీఎం పేర్కొన్నారు.

"థియేటర్? బయట ఉన్న పరిస్థితి దృష్ట్యా డీసీపీ నేరుగా హీరో వద్దకు వెళ్లారు. బయట ఒకరు చనిపోయారు, మీరు వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. మీరు వెళ్లకపోతే పీఎస్?కు తీసుకెళ్లాల్సి ఉంటుందని హీరోకు చెప్పారు. దీంతో రాత్రి 12 గంటలకు థియేటర్? నుంచి బయటకు వచ్చారు. తల్లి చనిపోయిందని, బాలుడు చావు బతుకుల మధ్య ఉన్నారని చెప్పారు. పరిస్థితి బాగాలేదని చెప్పినా వాహనంపైకి ఎక్కి చేతులు ఊపారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసి కొంద మందిని అరెస్టు చేశారు."

హీరోను పీఎస్?కు తరలిస్తే తిట్టారు : ఘటన తర్వాత 11 రోజులకు పోలీసులు హీరో ఇంటికి వెళ్లారు. కేసు నమోదు అయిందని హీరోకు పోలీసులు చెప్పారు. ఘటనలో ఏ11గా కేసు నమోదు అయిందని చెప్పారు. పోలీసుల పట్ల అల్లు అర్జున్? దురుసుగా ప్రవర్తించారు. విచారణలో భాగంగా హీరోను పోలీసులు పీఎస్?కు తీసుకెళ్లారని తెలిపారు. హీరోను పీఎస్?కు తీసుకెళ్తే కొందరు నేతలు తనను తిడుతూ పోస్టులు పెట్టారని అసహనం వ్యక్తం చేశారు. రూ.30 వేల ఉద్యోగం చేసుకునే వ్యక్తి రూ.12 వేలతో 4 టికెట్లు కొని సినిమాకు వెళ్లారని అన్నారు. కుమారుడు అల్లు అర్జున్? అభిమాని అని సినిమాకు తీసుకెళ్లారని వివరించారు.

చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేదా : 11 రోజుల వరకు బాధిత కుటుంబం వద్దకు హీరో, నిర్మాత వెళ్లలేదని సీఎం రేవంత్? రెడ్డి అసెంబ్లీలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏ రకమైన మానవత్వం అని సీఎం ప్రశ్నించారు. మానవత్వం లేని వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ హీరో దైవస్వరూపుడు.. ఆయనను ముట్టుకుంటారా అంటూ ఒక నేత ట్వీట్? చేశారని ధ్వజమెత్తారు. ఉద్యమ సమయంలో షూటింగ్?లు జరగవద్దన్న నేతలు.. ఆ హీరోను భగవత్? స్వరూపుడు అన్నారని ఆగ్రహించారు.

చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేకుండా చావుకు కారణమైన వారిని పీఎస్?కు తీసుకెళ్తే తప్పుపడుతున్నారని దుయ్యబట్టారు. ఈ ఘటనలో ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నించారన్నారు. ఈ ఘటనలో సీఎంను నీచమైన భాషలో తిట్టారని చెప్పారు. సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలని టికెట్ల రేట్లు పెంచుకునేందుకు, స్పెషల్? షోలకు అనుమతి ఇచ్చామని సీఎం రేవంత్? రెడ్డి అసెంబ్లీలో వివరణ ఇచ్చారు.

# సబ్జెక్ట్ లేనోడికి వదురుడు ఎక్కువ.. చేతగానోడికి ఏతులెక్కువ..

సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ అసెంబ్లీలో చేసిన ప్రసంగంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి ప్రసంగం తీరు.. మైకులో రంకెలు వేసి, గజ్జెల లాగేసుకుని.. పోతురాజు తీరుగా పడేల్ పడేల్‌మని ఆయనది ఆయనే కొట్టుకుని పారిపోయినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ఎల్పీలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అబద్ధాలను అడ్డుకునేటోడు లేడు.. ఆపటోడు లేడని విమర్శించారు. పదేండ్ల పాట తప్ప కొత్తగా చెప్పింది లేదు.. చేసింది అంతకన్నా లేదని అన్నారు. సబ్జెక్ట్ లేనోడికి వదురుడు ఎక్కువ.. చేతగానోడికి ఏతులెక్కువ అని సెటైర్ వేశారు. ముఖ్యమంత్రిగా నీకు మైక్ దొరకడమే రేవంత్ రెడ్డికి ఉన్న అనుకూలత అని హరీశ్‌రావు అన్నారు. అదే మైక్ తమకు ఇవ్వద్దని ముఖ్యమంత్రే స్పీకర్‌కు చెప్పాడని తెలిపారు. ఇప్పటికే చాలా అబద్ధాలు చెప్పా.. బీఆర్ఎస్‌కు మైక్ ఇస్తే.. నా అబద్ధాలను బయటపెడతారంటూ.. మైక్ ఇవ్వద్దని పరోక్షంగా స్పీకర్‌కు చెప్పి బయటకు పారిపోయాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి తెలిసింది గోరంత అని అన్నారు. ఆయన చెప్పేదంతా అబద్ధాలే అని పేర్కొన్నారు. అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి.. ఇవాళ అసెంబ్లీలో కూడా అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. మూసీ కాలుష్యం కంటే.. ముఖ్యమంత్రి నోటి కాలుష్యం ఎక్కువైందని అన్నారు. ఇవాళ జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కటన్నా నిజం చెప్పావా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి గొంతు చించుకోవడం తప్ప చేసిందేమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో గిన్నిస్ రికార్డును రేవంత్ రెడ్డి బద్ధలగొడుతున్నారని అన్నారు. రేవంత్ అబద్ధాల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఆ దేవుడే కాపాడాలేమో అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి చేసిన రెండు గంటల ప్రసంగంలో రైతు భరోసా ఎప్పుడిస్తారో? ఎంతిస్తారో? ఒక్క ముక్క కూడా చెప్పలేదని హరీశ్‌రావు విమర్శించారు. రెండు లక్షలకు పైగా ఉన్న అప్పును కడితే రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఆయన మాట నమ్మి చాలామంది రైతులు రెండు లక్షలకు పైగా ఉన్న రుణాన్ని కట్టేశారు..

## పుష్ప-2 సినిమాతో ఆఖరు...




సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలైన బాలుడు శ్రీతేజ్ ను తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సాయంత్రం పరామర్శించారు. అనంతరం ఆయన ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడారు. పుష్ప-2 ప్రీమియర్ షో చూసేందుకు రేవతి అనే మహిళ తన భర్త, కుమారుడితో శ్రీతేజ్ థియేటర్ వద్దకు వచ్చారని, అదే సమయంలో అల్లు అర్జున్ రావడంతో ఆయనను చూసేందుకు జనం ఎగబడ్డారని కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ తొక్కిసలాటలో రేవతి, అమె కుమారుడు కిందపడిపోయారని... రేవతి మృతి చెందగా, శ్రీతేజ్ బాగా దెబ్బలు తగిలాయని వివరించారు. ఇంత జరిగినా హీరో గానీ, నిర్మాత గానీ ఏమీ పట్టించుకోకుండా వెళ్లి థియేటర్ బాల్కనీలో కూర్చుని సినిమా చూశారని కోమటిరెడ్డి ఆరోపించారు. థియేటర్ బయట పరిస్థితి ఏమీ బాగా లేదు సార్... మీరు వెళ్లిపోండి అని ఏసీపీ చెప్పినా వినిపించుకోకపోవడంతో, డీసీపీ వెళ్లి గట్టిగా మందలింపు ధోరణితో చెప్పాల్సి వచ్చిందని అన్నారు. అయినప్పటికీ, సినిమా అయిపోయే దాకా చూసి, మళ్లీ వాహనం రూఫ్ టాప్ నుంచి చెయ్యి ఊపుకుంటూ వెళ్లారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. "అక్కడ రేవతి, ఆమె బిడ్డ పరిస్థితి గురించి సినిమా వాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. సినిమా చూడ్డానికి వచ్చిన వాళ్లు స్పందించడంతో, ఆమెను, ఆమె కొడుకును ఆసుపత్రికి తరలించారు. రేవతి చనిపోయింది. ఆమె కొడుకు చికిత్స పొందుతున్నాడు. ఇవాళ ఆ బిడ్డను చూసేందుకు ఆసుపత్రికి వచ్చాను. డాక్టర్లతోనూ, ఆసుపత్రి యాజమాన్యంతోనూ మాట్లాడాను. వెంటిలేటర్ తీసేసి, గొంతు వద్ద రంధ్రం చేసి శ్వాస అందిస్తున్నారు. పైపుల ద్వారా ఆహారం అందిస్తున్నారు... అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడు. మృతి చెందిన రేవతికి ఆత్మశాంతి కలగాలని, ఆమె కుమారుడు త్వరగా కోలుకోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. ఆ రోజున పోలీసుల అనుమతి లేకుండానే చిత్రబృందం థియేటర్ వద్దకు వచ్చింది. హీరో కాన్వాయ్ తో పాటు అనేకమంది బౌన్సర్లు థియేటర్ వద్దకు వచ్చారు. ప్రేక్షకులను బౌన్సర్లు నెట్టివేశారు. ఇక మీదట సినిమాల ప్రీమియర్ షోలకు అనుమతిచ్చే విషయంపై సమీక్ష చేపడతాం. ఎంత బడ్జెట్ పెట్టి సినిమా తీసినా, టికెట్ల రేట్లు పెంచుకోవడంపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటాం. దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిందా? లేక, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిందా? లేకపోతే, డ్రగ్స్ మీద, ఇతర సమస్యల మీద ప్రజలకు సందేశం ఇచ్చే సినిమానా? అనే విషయాలు ఆలోచించి, అది కూడా నామమాత్రంగానే టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తాం. బెనిఫిట్ షోలకు అనుమతించే ప్రశ్నే లేదు. ఇలాంటివన్నీ పుష్ప-2తోనే ఆపేస్తున్నాం. పుష్ప-2 చిత్రం బాగుంటే అందరూ చూడండి... నేను కూడా చూశాను. ఇకపై దేవుళ్ల సినిమాలు, చరిత్రకు సంబంధించిన సినిమాలు, రాజుల సినిమాలు, తెలంగాణ ఉద్యమ సినిమాలు తప్ప ఇతర తెలుగు సినిమాలు చూడదలచుకోలేదు. ఎందుకంటే... మూడున్నర గంటలు ఉండే సినిమా చూసే బదులు చాలా పనులు చేసుకోవచ్చు. ఆ సినిమా చూసిన తర్వాత మన యువకులు కూడా చెడిపోతారు" అని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

## పంచాయతీ ఎన్నికల నిబంధనలు యధాతథం!

-మొదటిపేజీ తరువాయి

దీంతో శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులో దీనికి సవరణ చేయలేదు. ఇతర అంశాలతో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టగా.. సభ ఆమోదం తెలిపింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి రాష్ట్రంలో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు పురపాలక, పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని చట్టం చేశారు. ప్రస్తుతం కుటుంబ నియంత్రణ పై అవగాహన పెరిగినందు కు పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

దీనికి కొందరు మంత్రులు హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ. చట్టసవరణ ప్రతిపాదనల్లో ఈ అంశాన్ని చేర్చి మంత్రిమండలి ఆమోదానికి పెట్టింది. దీనికి మంత్రిమండలి అనుమతించలేదు. తెలంగాణలో సంతానోత్పత్తి రేటు పై శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణంతో ఈ ప్రతిపాదనను నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ ఒక్కటి మినహా మిగిలిన అన్ని ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది. దీనికి అనుగుణంగా చట్టసవరణ బిల్లును రూపొందించి పంచాయతీరాజ్ శాఖ బిల్లును ప్రవేశపెట్టింది. మొన్నటి వరకు ఆశావహులుగా ఉన్న వ్యక్తులకు ఈ ప్రకటనతో నిరాశే మిగిలినట్లయింది. గ్రామీణ స్థాయిలో పోటీ చేసే వారికి కనీస విద్యా అర్హతలైనా పాటిస్తే చట్టాల అమలు పై అవగాహన ఉండేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఆశావహులుగా ఉన్న వ్యక్తుల్లో నిరాశే మిగిలింది. స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కనీస విద్యార్హత ప్రకటిస్తే చట్టాల పట్ల విధుల పట్ల కనీస అవగాహన ఉంటుందని కొందరి అభిప్రాయం.

## రాష్ట్రంలో 95 శాతం చిన్న.. సన్నకారు రైతులే: కేటీఆర్



**హైదరాబాద్:** రైతుబంధుపై అబద్ధాలు ప్రచారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతు పచ్చబడితే కొందరికి కళ్లు ఎర్రబడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత బాగుపడితే కొందరు ఓర్వలేకపోయారని మండిపడ్డారు. వందల ఎకరాలున్న రైతులకు, పెద్ద రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చామని దుష్ప్రచారం చేశారన్నారు. అసెంబ్లీలో రైతుభరోసాపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ బుడుగు, బలహీన వర్గాల రాష్ట్రం. నూటికి 95 శాతం మంది చిన్న సన్నకారు రైతులే ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో 91.33 శాతం మంది లబ్ధిదారులు 5 ఎకరాలు అంతకంటే తక్కువ ఉన్నవారే ఉన్నారు. 7.28 శాతం మంది 5 నుంచి 10 ఎకరాల మధ్య ఉన్నవారు ఉన్నారని, పదెకరాల పైన ఉన్నవారు కేవలం 1.39 శాతమని, 25 ఎకరాలున్నవారు 0.9 శాతం అని చెప్పారు. రూ.72 వేల కోట్ల రైతుబంధులో పెద్ద రైతులకు ఇచ్చింది 1.39 శాతం మాత్రమేనని వెల్లడించారు. 80 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నారు. అందులో బీసీలు 54 శాతం, ఎస్సీలు 13 శాతం, ఎస్టీలు 13 శాతం ఉన్నారు. 70 శాతం రైతుబంధు పైసలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల ఖాతాల్లో పడ్డాయన్నారు. 4.5 లక్షల ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ భూములను గిరిజనులకు ఇచ్చామని, ఆ భూముల్లో ఒక్క పంట మాత్రమే పండుతుందని, వారికిచ్చే పంటసాయంలో కోత పెట్టొద్దని సూచించారు. మట్టిని నమ్ముకున్న రైతుకు ఎంత చేసినా, ఎంతిచ్చినా తక్కువనన్నారు. కానీ అన్నదాత విషయంలో కోతలు పెడుదామనుకుంటున్నారని చెప్పారు. రైతుకు చేసే సాయాన్ని దానధర్మంగా చూసే ప్రయత్నం చేస్తున్నారు. రైతు భరోసాను భారంగా చూడొద్దన్నారు. బాధ్యతగా చూడాలన్నారు. రాష్ట్రంలో 47 శాతం మందికి వ్యవసాయం ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని, పరోక్షంగా కలుపుకుంటే 65 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. పరిశ్రమలకేమో పెద్దపెద్ద ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, రైతుల విషయానికి వచ్చేసరికి కటింగులు పెట్టేందుకు చూడటం మంచిదికాదన్నారు.

# ట్రంప్ మాటల అంతరార్థం




అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మరోసారి మన దేశాన్ని బెదిరించాడు. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బ తీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్య పోరును ప్రారంభించటమే కాదు. మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం (జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మన దేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బ తీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్య పోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్థం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది. లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు. ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు, లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35 శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురు దాడికి దిగుతున్నది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు. అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది. ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్ అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు. అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు. మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగ పరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండు దేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటి వారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పది సంవత్సరాలలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్.ఎఫ్.ఏ.పి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేళ్ల కాలంలో 75 శాతం తగ్గాయి. అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. అమెరికాకు అగ్రస్థానమే తన లక్ష్యం అని చెబుతున్న ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

# కాకలుతీరిన రాజకీయ నేత కాకా



రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా...'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకటస్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండేవారు. హైదరాబాద్‌లో ఖాళీస్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఏఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్యసమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు. 1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెదపల్లి లోకసభ నియోజకవర్గంనుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %ಒ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973-మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్. 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యుటి లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోర్ట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్ మెంబర్, కన్ సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జీ పని చేశారు. కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానందా, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు. ఆయన 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించాడు.

# అపరగణిత మేధావి రామానుజన్




20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన, భారతీయ గణిత చరిత్రకు మెరుగులుదిద్దిన శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతియేటా డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపు కొంటున్నారు. గణిత శాస్త్రములో ఆర్యభట్ట, భాస్కరాచార్యులు తరువాత భారత దేశానికి గొప్ప పేరు తెచ్చిన మేధావి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ (1887 డిసెంబర్ 22 - 1920 ఏప్రిల్ 26). తన విలక్షణ అసమాన మేధాసంపత్తితో అనన్య సామాన్యమైన కృషిచేసి భారతీయ కీర్తి పతాకాన్ని దశదిశలా ఎగరవేసిన మహా గణితజ్ఞుడు శ్రీనివాస రామానుజన్. ఆయన జీవించింది 32 అయినా 3900పైగా సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అపరగణిత మేధావి. ఆయన సిద్దాంతాలపై నేటికీ ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతుండడం విశేషం. గణితం వేద కాలము నుండి భారతీయ సంప్రదాయంలో భాగమేనని మన వేద గణితం ద్వారా మనకు తెలుస్తున్నది. గణితం ప్రాచీన భారత దేశంతో పాటు ప్రాచీన ఈజిప్టు, మెసపు టేమియా, ప్రాచీన చైనా, ప్రాచీన గ్రీకు నాగరికతలలో ఎక్కువగా అభివృద్ధి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా గణితము అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంతో ఉంది. సంఖ్యామానానికి పట్టుకొమ్మ అయిన సున్నా భారతీయుల ఆవిష్కరణే. ప్రాచీన భారతీయులు గణితంలో ఎన్నో విషయాలు కనుగొన్నారు. సంఖ్యలను కనుగొనడంలో చాల కృషి చేశారు. దశాంశ పద్ధతిని గుర్తించిన మొదటివారు భారతీయులే. ఆర్యభట్ట కాలాన్ని భారతీయ గణిత శాస్త్రానికి స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఇది భాస్కరా చార్యుని వరకు అప్రతిహతంగా సాగింది. భాస్కరాచార్యుని తర్వాత కాలంలో బహు విదేశీ దండ యాత్రల వల్ల గణితం కళ తప్పింది. అనువాదాలు, వ్యాఖ్యానాలు తప్ప పెద్దగా స్వతంత్ర గణిత సారస్వతం ఏదీ ఆవిష్కరణ కాలేదు. ఆ స్థితిలో మళ్లీ భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన మేధావి శ్రీనివాస రామానుజన్. గణితంపై అనేక గ్రీకు అరబిక్ గ్రంథాలు 12వ శతాబ్దం నుండి లాటిన్‌లోకి అనువదించ బడ్డాయి. ఇది మధ్యయుగంలో ఐరోపాలో గణిత శాస్త్రం మరింత అభివృద్ధికి దారితీసింది. పురాతన కాలంమధ్య యుగాల వరకు, గణితశాస్త్ర ఆవిష్కరణ కాలాలు తరచుగా శతాబ్దాల స్తబ్దతతో అనుసరించ బడ్డాయి. 15వ శతాబ్దంలో పునరుజ్జీవనోద్యమం ఇటలీలో ప్రారంభమై, కొత్తగణిత శాస్త్రపరిణామాలు, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల పరంపర పెరుగుతున్న వేగంతోఈ రోజు వరకు కొనసాగుతోంది. ఆధునిక కాలపు తొలినాళ్ళలో పశ్చిమ ఐరోపాలో గణిత శాస్త్రం అభివృద్ధి వేగం పుంజుకుంది. 17వ శతాబ్దంలో న్యూటన్, లీబ్నిజ్ ల కలన గణితం అభివృద్ధి చెందిది. గణితంలో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. లియొన్‌హార్డ్ ఆయిలర్ 18వ శతాబ్దంలో అత్యంత ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు, అనేక సిద్ధాంతాలు, ఆవిష్కరణలకు తోడ్పడ్డాడు. 19వ శతాబ్దంపు తొలి గణిత శాస్త్రజ్ఞులలో ఒకడైన కార్ల్ ఫ్రెడ్రిక్ గాస్... బీజగణితం, విశ్లేషణ, అవకలన జ్యామితి, మాతృక సిద్ధాంతం, సంఖ్యా సిద్ధాంతం, గణాంకాలు వంటి రంగాలలో అనేక రచనలు చేశాడు. శ్రీనివాస రామానుజన్, కల్యం పూడి రాధాకృష్ణ రావు, సుజాత రాందొరై, పి.సి. మహల నోబిస్, మడకా హరిప్రసాద్ లాంటి ప్రముఖ భారతీయ గణిత శాస్త్రజ్ఞులు విశేష కృషి చేశారు. 2012 ఫిబ్రవరి 26 న మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరిగిన రామానుజన్ 125వ జయంతి ప్రారంభ వేడుకల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. అలాగే 2012 ను జాతీయ గణిత సంవత్సరంగా జరుపుకుంటామని ప్రకటించారు. అలా 2012 నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబర్ 22 ను జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడం,గణిత శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడం, ఆర్థిక, విజ్ఞాన శాస్త్రం, ఇతర విభాగాలలో దాని అనువర్తనాన్ని అన్వేషించడంతో పాటు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను స్మరించుకుని, గౌరవించటం జాతీయ గణిత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. భారత దేశంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటారు. రామానుజన్ 75వ జన్మదినోత్సం సందర్భంగా 1962లో కేంద్ర సర్కార్ పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. అత్యంత చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ మ్యాథ్స్ జీనియస్ గా పేరుగాంచిన ఆయన జీవిత ఆధారంగా ద మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ పేరుతో సినిమా కూడా విడుదలైంది.

## వర్గీకరణ వెంటనే అమలు చేయాలి




**అగ్నిధారన్యూస్ కమన్ పూర్** ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలి అని ఎలాంటి కాలయాపన చెయ్యరాదు అని ఎంఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి పేర్కొన్నారు...శనివారం కమణ్ పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ ఆతర్వాత ముఖం చేటేస్తునారు అని ఆయన ఆరోపించారు.. వర్గీకరణ చెయ్యని యెడల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని ఆయన అన్నారు.వెయ్యి గొంతుకలు వెయ్యి డప్పులతో నిరసన వ్యక్తం చేస్తాం అని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ నాయకులు, మంథని మధు,కుక్క రవి,సంతోష్ , నరసింగం ఓదెలు, మాజీ సర్పంచ్ పిడుగు నరసయ్య, దేవయ్య, పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



**అగ్నిధార న్యూస్ కమన్ పూర్** కమన్ పుర్ మండల కేంద్రంలోని అంగడి బజార్ లో బిజెపి నాయకులు మచ్చ గిరి రము, ఫార్చ్యూన్ మెడికేర్ కరీంనగర్ ఆసుపత్రి వారిచే నిర్వహించిన వైద్య శిబిరం లో అత్యధికంగా ప్రజలు పాల్గొని వైద్య సేవలు చేయించుకున్నారు , షుగర్ బీపీ, గుండె సంబంధిత వ్యాధులను పరీక్షించి ఉచితంగా మందులు పంపని చేశారు... ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జంగపల్లి అజయ్, మట్ట శంకర్, అరుణ్,సతీష్, తోపాటు అధిక సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు...

## ఉత్తమ పర్యావరణహిత, గృహాల పోటీలను పరిశీలించిన జీఎం




**అగ్ని ధార న్యూస్. మందమర్రి డిసెంబర్ 21.**మందమర్రి ఏరియా సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకొని, మందమర్రి ఏరియాలోని, కాలనీలలో ఉత్తమ పర్యావరణహిత గృహాల పోటీలను సింగరేణి ఉద్యోగులు నివసించే గృహాలను వారు పెంచుకునే మొక్కలను ఇంటి పరిసరాలు, వాతావరణం,ఇంటిని అలంకరించుకున్న విధానమును శనివారం రోజున ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలించారు.గృహ శోభ పోటీలలో 9 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకోగా వారిలో ఎంపికైన గృహస్థులకు సింగరేణి దినోత్సవ వేడుకల్లో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి .దేవేందర్ చేతుల మీదుగా.. బహుమతులు అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్టేట్ అధికారి వెంకట్ రెడ్డి ,ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి,డి వై పి ఎం సత్య బోస్, పర్యావరణ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపిబూత్‌అధ్యక్షుల నియామకం



**అగ్ని ధార న్యూస్ సుల్తానాబాద్** సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని 17వనూతన బూత్ అధ్యక్షుల నియామకాల ప్రారంభోత్సవం కార్యక్రమం సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని 2వ వార్డ్ లోని బూత్ నెంబర్ 202లో బిజెపి మున్సిపాల్ అధ్యక్షులు కూకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో 2వ వార్డ్ లోని 202బూత్ అధ్యక్షులుగా దేశెట్టి సాయి కుమార్ నియామకం కావడం జరిగింది అని బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రముక్ అరుముళ్ళ పోషం బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు శిలారపు పర్వతాలుఅసెంబ్లీ ప్రముక్ పొల్సాని సంపత్ రావుజిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు వనజా పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కూకట్ల చంద్రకళ, బిజెపి నాయకులు ఎనగందుల సతీష్, గజభింకర్ పవన్, శేకర్ మాస్టర్, 2వ వార్డ్ మహిళా కార్యకర్తలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆనందాన్ని కలిగించే క్షణాలు





**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"సంగారెడ్డి జిల్లా** జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్ కల్ మండల మారుమూల గ్రామమైన ముర్తుజాపూర్ గ్రామానికి చెందిన పుష్పలత వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న తను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాల్కీ పాఠశాలలో 10 వ తరగతి వరకు చదివి ఉన్నత చదువులు పూర్తి చేసుకొన్న తర్వాత గత సంవత్సరం జరిగిన పోటీ పరీక్షల్లో నెగ్గి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఎంపికై ట్రైనింగ్ తర్వాత వికారాబాద్ జిల్లాలో ట్రైనీ సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఉన్నారు... పోలీసు శాఖలో ఉన్న తన విధుల్లో బిజీ గా ఉన్నప్పటికీ గురువులతో తనకు ఉన్న అనుబంధం, గౌరవం మేరకు ఉద్యోగం పొందిన తర్వాత మొదటి సారిగా 19/12/2024 నాడు తన గురువైన మొహమ్మద్. సమియుద్దీన్ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామిడ్గి ను సందర్శించారు. తన శిష్యురాలు ఒక ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించిన తర్వాత తన య్నొక్క పాఠశాలను సందర్శించడం ఒక గురువుగా గొప్ప అనుభూతిని చాలా ఆనందాన్ని కలిగించడం తోపాటు పాఠశాల విద్యార్థులకు ప్రేరణతో పాటు ప్రోత్సాహాన్ని కలిగించినట్లు మొహమ్మద్. సమియుద్దిన్ తెలియజేసారు. ఈ సందర్శన లో భాగంగా పుష్పలతా 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తో పాటు సైబర్ క్రైమ్ అదేవిధంగా విద్యార్థి దశ నుండి ఉద్యోగ దశ వరకు తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నది. యూనిఫాంలో పాఠశాల సందర్శన విద్యార్థులతో పంచుకున్న అనుభవాలు ప్రత్యేకంగా బాలికలకు చాలా ప్రేరణను కల్గించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ జీ. హెచ్. ఎమ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, అలాగే మొహమ్మద్. సమియుద్దీన్ పాఠశాల విద్యార్థులు పుష్పలతని సన్మానించడం జరిగింది.

# సింగరేణి బకాయిలు ఇప్పించండి

**కొత్త మైన్స్ వస్తెనే సింగరేణి కి మనుగడ.**

**ఎంఎండిఆర్ చట్టం వల్ల కొత్త మైన్స్ రావడం లేదు.**

**సింగరేణి లో అధికారం ఉన్నా, లేకున్నా కార్మికుల పక్షపాతి ఏఐటియుసి.**



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి కి రావలసిన 33వేల కోట్ల రూపాయల బకాయిలు ఇప్పించాలని గుర్తింపు సంఘం పై విమర్శలు చేయడం కాదని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయుసి కి సూచించారు. గత పది సంవత్సరాలుగా ఐఎన్టీయుసి యూనియన్ సింగరేణి లో ఎక్కడ ఉందని వారు ప్రశ్నించారు, రాష్ట్రంలో కోల్ బెల్ట్ ప్రాంతంలో సిపిఐ, ఏఐటియుసి మద్దతు తో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అండ చూసుకుని నేడు సింగరేణి లో కార్మికులను మభ్యపెడుతూ గుర్తింపు సంఘం ఏఐటియుసి పై విమర్శలు చేయడం మానుకోవాలని వారు పేర్కొన్నారు. సింగరేణి లో గత పది సంవత్సరాలుగా అధికారం ఉన్నా, లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు చేసిన చరిత్ర ఏఐటియుసి యూనియన్ దని పేర్కొన్నారు. సింగరేణి లో ఏఐటియుసి అధికారం లో ఉన్నా, లేకున్నా కొన్ని యూనియన్ లు పనికి రాని విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతూ కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. అదె విధంగా సింగరేణి లో గనులు మూతపడుతున్నాయని, కొత్త గనులు రావాల్సి ఉందని, ఎంఎండిఆర్ చట్టం వల్ల సింగరేణి కి కొత్త గనులు రావడం లేదని, యాజమాన్యం పాత గనులు మూసివేసి ఓపెన్ కాస్ట్ లుగా మారుస్తున్నారని తెలిపారు, దీని వల్ల సింగరేణి మనుగడ కొనసాగడం కష్టమని, కొత్త గనుల కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, వీటి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఏఐటియుసి ఒత్తిడి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సింగరేణి లో ఏఐటియుసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం పై ఒత్తిడి పెంచేందుకు ఏఐటియుసి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. సింగరేణి లో హక్కులు సాధించాలన్న, పోరాటాలు చేయాలన్న ఏఐటియుసి కే సాధ్యమని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సింగరేణి లో ఏఐటియుసి కి గుర్తింపు ఉన్నా, లేకున్నా కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం, సంస్థ అభివృద్ధికి కోసం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు సిద్దమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశల నరేశ్, మానాల శ్రీనివాస్, చెప్యాల భాస్కర్, గడ్డం బాలు, తాళ్ పెల్లి శ్రీనివాస్, జంజర్ల కళ్యాణ్, గోసుకుల శ్రీనివాస్, మందల కిరణ్, సాయి క్రిష్ణ రెడ్డి,ముడుసు రమేశ్, ఎం.డి.రియాజ్, మండల సత్యనారాయణ, ఆకుల సురేష్, దుర్గం తిరుపతి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# శుభ్రత పాటించండి, మంచి పారితోషకం పొందండి

## జిల్లా ఎన్ ఎస్ యుఐ జనరల్ సెక్రటరీ

## కర్నాటి నందకుమార్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మధ్యాహ్న భోజ పథకాన్ని తనికి చేసిన వనపర్తి జిల్లా ఎన్ ఎస్ యుఐ జనరల్ సెక్రటరీ కర్నాటి నందు కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో వంటకు శుభ్రమైన పాత్రలు ఉపయోగించాలని ఓపికతో విద్యార్థులకు వండి వడ్డించాలని, పనివారికి ప్రభుత్వము నుంచి మంచి పారితోషకం ఇస్తుదని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిరాసిపల్లి నందు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి మధ్యాహ్న భోజనం గూర్చిఅయన తెలుసుకున్నారు. వంట చేసే వర్కర్స్ ను విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తో పాటు శుభ్రత ను పాటించాలనిచెప్పారు వంట వర్కర్స్ కు ప్రభుత్వం నుంచి మంచి పారితోషికం అందజేస్తుంది అని, విద్యార్థులకు గాని, వర్క్స గాని ఏవైనా సమస్సలు ఉంటే ఎన్ ఎస్ యు ఐ అండగా ఉంటుందని అయన తెలియజేశారు

# రాజకీయాలకు కొత్త మలుపు మన రాజన్న కొడుకు

## రాజకీయవారసుల్లో కీర్తి యువతకు స్ఫూర్తి

## గంగవరం రామకృష్ణారెడ్డి






**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే, వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ సొంత అధికార పార్టీని విభేదించి రాజకీయాల్లో ఒక చరిత్రను సృష్టించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని చెప్పవచ్చని దేశ రాజకీయాల్లో ఎంతోమంది రాజకీయ వారసులు ఉన్నప్పటికీ ఇంత గొప్ప ప్రజాదారణ పొందిన వ్యక్తి బహుశా జగన్మోహన్ రెడ్డి ఒక్కరే ఉంటారని ఆయన అన్నారు. రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పథకాలు తనను ఆకర్షించాయని రాజకీయాలంటే గిట్టని తాను, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న కోరిక, రాజకీయాల్లో మంచి చేస్తే ప్రజలు ఎంతగా ప్రేమిస్తారన్నది రాజశేఖర్ రెడ్డి మరణం ద్వారా తెలిసిందని, రాజశేఖర్ రెడ్డిని మించిన ప్రజాదరణ జగన్మోహన్ రెడ్డి లో ఉందని కావున తాను వారి రాజకీయ విధానాలను అభిమానిస్తానని, ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని, యువకులు తమ వ్యక్తిగతంగా, తమ ఆశయాలకు తగ్గట్టు రాజకీయాల్లో రావాలని, సమాజ మార్పుకై, సొంత ఆశయాలకై యువత పరితపించాలని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన జగన్మోహన్ రెడ్డికి దేవుడు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆయుష్షుని ఇవ్వాలని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కంది రైతులను మోసం చేస్తున్న దళారులు

**సిండికేట్లవుతున్న వ్యాపారులు**






**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్** ఫోటోలకు ఫోజులు ఇవ్వడం కాదు రైతు పండగ అంటే బిజెపి మండల అధ్యక్షుడు కురువ కృష్ణమహమ్మదాబాద్:రైతు పండగలు.సంబరాలు చేస్తున్న ప్రభుత్వ పెద్దలు ఒక్కసారి దళారీ వ్యవస్థ మాయాజాలం కంది పోతున్న రైతుల బాధలు పట్టించు కోవాలి. వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన వారు.మండలానికి ఒక కంది కొనుగోలు కేంద్రాలు ఎందుకూ ఏర్పాటు చెయ్యడం లేదు. రైతూ చట్టాలు వద్దని బ్రోకర్ల రోడ్లమీదకి వచ్చి ఆందోళనలు చేసినప్పుడు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు రైతుల బాధలు కనిపించడం లేదా?మార్కెట్ లో కిలో కందీ పప్పు180 నుండి 200 వరకూ ఉంది నేడు రైతులు పండించిన కంది పంట మార్కెట్లోకి తీసుకెళ్తున్న రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు ప్రతి క్వింటాలుకు 4.నుండి 6 కేజీ ల తరుగు తిస్తు తక్కువ ధరకు ఇస్తే ఇవ్వు లేకుంటే లేదు అంటున్నారు.. ఉన్నత అధికారులు స్పందించి కంది పంట రైతుల సమస్య పై దృష్టి పెట్టాలని అలాగే క్వింటాలుకు 12000/-వరకూ మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు

## బూత్ స్థాయి నుండి బీజేపీ బలోపేతం

**బిజెపి మాజీ మండల అధ్యక్షుడు ప్రభు నాయక్**



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ గండీడ్ :** గండీడ్ మండల పరిధిలోని కప్లపూర్ గ్రామంలో శనివారం రోజు పోలింగ్ బూత్ నంబర్ 59లో బీజేపీ బూత్ కమిటీనీ ఎన్నుకోవడం జరిగింది. మాజీ మండల అధ్యక్షుడు ప్రభు నాయక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుండి బలోపేతం చేస్తేనే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో అధిక స్థానాలు గెలుస్తాం అన్నారు, కప్లపూర్ గ్రామ బూత్ అధ్యక్షుడు గా గుండ్యాల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి గా మల్లేష్, బిఎల్ఏ గా కేశవులు, ని నియమిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు సంతోష్ నాయక్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు కావాలి నర్సయ్య,కార్యకర్తలు భీమయ్య, సాయి కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


## వైన్ షాపులపై రైడ్



**అగ్నిధారన్యూస్. మందమర్రి మండలం డిసెంబర్ 21.** తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం, మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, మందమర్రి పట్టణంలోని వైన్ షాపుల నందు ప్లాస్టిక్ రైడ్ చేయడం జరిగినది. ఇందులో భాగంగా ..120 మైక్రన్ల కంటే తక్కువ ఉన్నటువంటి ప్లాస్టిక్ గ్లాసులు వాడటం వలన, ఆహార పదార్థాల తయారీ లో నాణ్యత పరి శుభ్రత పాటించుటకు నిల్వ ఉన్న, ఆహార పదార్థాల, ప్రాంతాలపై ఈగలు ,దోమలు మొదలగునవి వాలకుండా. తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా, సూచనలు జారీ చేసి, రూ. 3500.00 విధించడం జరిమానా జరిగినది. ఇట్టి కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్, శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్ పి కృష్ణ ప్రసాద్ హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏ. సమీర్, బిల్ కలెక్టర్ లింగయ్య,బి. శ్యాంబాబు,వి ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్**




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తల కొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పల పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జంగయ్య ఈరోజు తెల్లవారుజా మున అకస్మాత్తు గా మరణించడం జరిగింది. ఈ విషయం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముకురాల అశోక్ గౌడ్ ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ కు తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించిన మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, తమ ట్రస్టు ద్వారా తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి ముకురాల అశోక్ గౌడ్ ద్వారా 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో,శరత్ చంద్ర, కావాలి కృష్ణ,ఎదుల అనిల్, చంద్ర శేఖర్, మండల రాజు, మాజీ వార్డ్ నెంబర్ లక్ష్మమ్మ, రాములమ్మ,మాల ముత్యాల్, తదితరులు పాల్గొన్నారు.

# విలీనం చేస్తే ఉద్యమానికి సిద్ధం

**గ్రామ పంచాయితీలుగా కొనసాగించాలి**

**ఇరు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** అభివృద్ధి నినాదంతో సాధించుకున్న హక్కును రాజకీయ లబ్ధికోసం,స్వార్థ రాజకీయాల కోసం కొందరి కుట్ర. ఉమ్మడి గ్రామపంచాయితిగా చేస్తే మరో లగచర్ల ఉద్యమం చేస్తాం. 30ఏండ్లుగా పోరాటం చేసి గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత మా కలను నిరంజన్ రెడ్డి నెరవేర్చి బలిజేపల్లి, జంగమాయపల్లి గ్రామాలను ప్రత్యేక గ్రామపంచాయతిలుగా చేశారని,వేరు వేరు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు అయిన తర్వాత గ్రామాలు శరవేగంతో అభివృద్ధి చెందాయని రెండు గ్రామాల ప్రజలం ఐకమత్యంతో మెలుగుతున్నామని ఆటువంటి మామధ్యమ నస్పర్థలు,విబేధాలు సృష్టించి మళ్ళీ రెండు గ్రామాలను కలిపి ఉమ్మడి గ్రామ పంచాయితీగా చేసి లబ్ధిపొందాలని స్థానిక ఎం.ఎల్. ఎ మేఘారెడ్డి,మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్ కుట్ర పన్నుతున్నారని విట్ట. నరసింహ రెడ్డి (రైతుబంధు అధ్యక్షులు), గట్టు.నగేష్(మాజీ ఉప సర్పంచ్), విట్టా.సంజీవ్ రెడ్డి (గ్రామఅధ్యక్షులు),కుమ్మరి.బాలస్వామి ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా అధికారం ఉంది కదా అని తమ రాజకీయ లబ్ధికోసం గ్రామాల మధ్య చిచ్చుపెట్టడాన్ని సహించబోమని హెచ్చరించారు.ఎవరికివారు పంచాయితీ భవనాలు నిర్మించుకొని, రెవెన్యూ రికార్డు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి దశలో కొనసాగుతున్న వారి పట్ల రాజకీయ కుట్రలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా మళ్ళీ ఉమ్మడి గ్రామ పంచాయితీ చేయడానికి నిర్ణయం తీసుకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.శనివారం కలెక్టర్‌ని కలసి వినతిపత్రం సమర్పించడం జరిగింది మా అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశామని తెలిపారు ఈ సమావేశంలో రాములు, బోయ మంగయ్య, బోయ. రాములు, పి.కృష్ణారెడ్డి, జె.జగదీశ్వర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,నరేష్, హరిజన్. వెంకటేష్,బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్ ప్రభు పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం




**అగ్నిధార న్యూస్ (సంగారెడ్డి) జిల్లా జహీరాబాద్ డిసెంబర్ 21** ప్రపంచ ధ్యాన దినోత్సవ సందర్భంగా శ్రీ మాణిక్ ప్రభు పాఠశాలలో ఘనంగా "ధ్యాన దినోత్సవం "కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ నరేందర్ పాల్గొని ధ్యానం యొక్క విశిష్టతను ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు ఎంతో చక్కగా వివరించారు ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల ఎంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చేస్తున్న పనిమీద శ్రద్ధ వస్తుందని ధ్యానం వల్ల అనేక అనారోగ్యలకు దూరం ఉంటామని ప్రతి ఒక్క విద్యార్థులకు ధ్యానం తప్పనిసరిగా అవసరమని తెలియజేశారు. పాఠశాలకు విచ్చేసిన డాక్టర్ నరేందర్‌కు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటయ్య ఉపాధ్యాయులు కల్పన, నాగలక్ష్మి, అనిత, సునీత, శ్రీదేవి, రాజేశ్వరి, సోని, మాణిక్యమ్మ, సువర్ణ, శివశంకర్, మధు పాల్గొన్నారు

## హక్కులు అడుగుతే అరెస్ట్ చేస్తారా...?

**వై.యాకయ్య, వేల్పుల కుమారస్వామి.**




**అగ్నిధార న్యూస్,(రామగుండం):** మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో ఇందిరా పార్క్, హైదరాబాద్ కు పిలుపివ్వడం జరిగింది. ఈసందర్భంగా గోదావరిఖనిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, రామగుండం మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై.యాకయ్య లతోపాటు జిల్లాలో ఉన్న పెద్దపల్లి,మంథని, సుల్తానాబాద్ మున్సిపల్ లలో కార్మికులను, సీఐటీయూ,నాయకులను హైదరాబాద్ కు వెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అర్థ రాత్రి నుండి నాయకుల ఇండ్లలోకి, కార్మికుల పని స్థలాల్లోకి పోలీసులు వెళ్లి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీఐటీయూ రామగుండం మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై.యాకయ్య, జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి లు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేయడం తప్పా? అని ప్రశ్నించారు. ప్రజా పాలనలో హక్కులు అడగకూడదా? అని అన్నారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టులు చేయడమేనా? అన్నారు. గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం కార్మికులపై, నాయకులపై ఈ విధమైన అక్రమ అరెస్టులు, నిర్బంధాలు ప్రయోగిస్తే ఏం జరిగిందో కాంగ్రెస్ పార్టీ బాగా తెలుసు, అయినప్పటికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధానాలను అనుసరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని, అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఏరి కోరి తెచ్చుకుంటుందని అన్నారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను నిలువరించాలనుకోడం మూర?త్వం అని అన్నారు. అరెస్టులు అయిన కార్మికులను, సీఐటీయూ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కల్వకుర్తిలో 10వ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నాగర్ కర్నూల్ జిల్లా మొదటిసారిగా కల్వకుర్తి రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీకి ఆతిథ్యం ఈనెల 22న కల్వకుర్తి పట్టణం చారిత్రక క్షణానికి వేదిక కానుంది. నెహ్రూ చౌరస్తా నుండి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు 10వ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు.ఈ పోటీలు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో నిర్వహించబడటంతో క్రీడాకారులు, ప్రజలు విస్తృతంగా ఆసక్తి చూపుతున్నారు. పోటీల ప్రత్యేకతలు మొత్తం 1200 మంది క్రీడాకారులు రాష్ట్ర నలుమూలల నుండి పోటీల్లో పాల్గొననున్నారు. నెహ్రూ చౌరస్తా నుంచి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు నిర్వహించే ఈ మార్గం క్రీడాకారులకు కొత్త అనుభవాన్ని అందించనుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 32 మంది అథ్లెట్లను జాతీయ స్థాయిఎంపిక చేయనున్నారు. గౌరవ అతిథుల హాజరు ఈ మహోన్నత పోటీలకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర క్రీడల ముఖ్య సలహాదారు, ఒలంపిక్ ప్రెసిడెంట్ ఏపీ జితేందర్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, తెలంగాణ ఒలంపిక్ జనరల్ సెక్రెటరీ మల్లారెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష, రాజేష్ రెడ్డి, తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్ ఠాగూర్, వై వి గోపాలకృష్ణమూర్తి ,ఏసీ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ వావిలాల మనీలా సంజీవ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు నాగర్ కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ సులపోగుల స్వాములు మాట్లాడుతూ, క్రీడాకారులకు ఉన్నత స్థాయి వసతులు, అవసరమైన అన్ని సహాయాలు అందిస్తున్నాం. ఈ పోటీలు జిల్లా క్రీడా చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తాయి అన్నారు. నగరంలో క్రీడా ఉత్సాహం కల్వకుర్తిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇది గొప్ప అవకాశం. క్రాస్ కంట్రీ పోటీల ప్రాధాన్యత క్రాస్ కంట్రీ రేసింగ్ ఒకటి ప్రాక్టికల్ ఫిట్‌నెస్ పరీక్షగా పరిగణించబడుతుంది. ఇది అథ్లెట్ల మానసిక, శారీరక సామర్థ్యాలను క్షమతలను పరీక్షిస్తుంది.తీరుపై దృష్టి ఈ పోటీల విజయానికి స్థానికంగా ప్రజలు, అధికారులు కలిసి కృషి చేస్తున్నారు. క్రీడల ద్వారా సామాజిక స్ఫూర్తి పెరుగుతుంది" అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు కేవలం ఒక రేస్ మాత్రమే కాదు, తెలంగాణ క్రీడల పునరుజ్జీవనానికి చిహ్నం. ఈ కార్యక్రమంలో, స్వేరోస్ నాయకులు పోలె రాజు, రామస్వామి, శంకర్ నాయక్, ఆర్గనైజర్ స్వాములు, ఆంజనేయులు,మల్లేష్,ప్రసాద్,తది తరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో సుంకీ రెడ్డి పర్యటన

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,**

**తెలంగాణ టాస్క్ సి. ఓ. ఓ**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం బైరాపూర్ గ్రామంలో సైదులు దేవుడు దర్గా కోసమై(రూ.2.50 లక్షలతో)ఐక్యత ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన రేకుల షెడ్ ప్రారంభోత్సవానికి హజరుకానున్నారు.సమయం ఉదయం10:00 గం.లకు కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చెన్నకేశవస్వామి గుడిని సందర్శించనున్నారు.సమయం మధ్యాహ్నం 12:00 గం.లకు ,కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామం ఇటీవల మరణించిన స్వర్గీయ మాజీ మండల కోప్షన్ సభ్యుడు, మాజీ సర్పంచ్ రుక్నోద్దిన్ కుటుంబానికి పరామర్శ సమయం మధ్యాహ్నం 01:30 గం.లకు వెల్దండ మండలం రాచూరు గ్రామం ఇటీవల అనారోగ్యంతో మరణించిన రిపోర్టర్ శ్రీరాములు కుటుంబానికి పరామర్శ మధ్యాహ్నం 02:30 గం.లకు కడ్తల్ మండలం అన్వాస్ పల్లి మహేశ్వరమహా పిరమిడ్ లో జరిగే ధ్యాన మహాచక్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. సమయం సాయంత్రం 05:00 గం.లకు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి మనుమడు మనవరాళ్ల నూతన వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కార్యస్థలం వంగ అనంత రెడ్డి గార్డెన్స్, కర్మన్ ఘాట్, సమయం సాయంత్రం 07:30 గం.లకుకావున ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు మరియు అందు బాటులో ఉన్న నాయకులు,కార్యకర్తలు, అభిమానులు శ్రేయోభిలాషులందరూ పాల్గొనగలరని మనవి.

## అమిత్ షా క్షమాపణ చెప్పాలి



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్.**పార్లమెంటులో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించే విధంగా ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలనీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవార్డు గ్రహీత సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కేంద్ర కమిటీ సభ్యుడు కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన ఇరుగు రాళ్ల శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశ శాంతి భద్రతులకు విఘాతం కలిగించే విధంగా ప్రసంగించినందుకు వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంబేద్కర్ పై ఎటువంటి కామెంట్లు చేసిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని ఎంపీ పదవికి రాజీనామా చేయాలని లేనిపక్షంలో అంబేద్కర్ వాదుల కోపాగ్నికి బలి అయితావు అని హెచ్చరించారు..

## ఝురసంఘం రహదారి విస్తరించాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి కి వినతి

**వినతి పత్రం అందజేసిన జహీరాబాద్ ఎంఎల్ఏ**



**అగ్నిధార న్యూస్ (సంగారెడ్డి)** జిల్లా జహీరాబాద్ డివిజన్, ఝరాసంఘం మండల కేంద్రంలో ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు, శనివారం రాష్ట్ర రహదారుల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రమైన ఝరసంఘంలోప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రము శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి ప్రధాన దేవాలయం ఉండడం,నిత్యం తెలంగాణ, రాష్ట్రం తో పాటు కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దేవస్థానంకు భక్తులు తరలి వస్తు టారు,జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు అవుతుండడం వల్ల ఇట్టి రోడ్డుపై నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు వస్తూపోతూ ఉంటాయి కనుక అట్టి రోడ్డును బాగు చేయాలని విస్తరణ పనులు చేయాలని గత ప్రభుత్వంలో 5కోట్ల రూపాయల వరకు మంజూరు చేశామని ,ప్రస్తుతం రోడ్డు అనుకూలంగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని , మరిన్ని నిధులను మంజూరు చేయాలని అంతేకాకుండా రోడ్డు పక్కల ఉన్న విద్యుత్ స్తంభాలతో కూడా ఇబ్బందికరంగా ఉందని రోడ్డును విస్తరించి అనుకూలమైన ప్రధాన రహదారిగా మార్చాలని ఎమ్మెల్యే మంత్రికి వినతిపత్రం అందజేశారు...

# సింగరేణి బొగ్గు రవాణాకు పూర్తి సహకారం

**అగ్ని ధార న్యూస్. మందమర్రి డిసెంబర్ 21.** డిమాండ్ మేరకు రేకులను అందుబాటులో ఉంచేలా చర్యలు సింగరేణి బొగ్గు రవాణాకు పూర్తి సహకారం డిమాండ్ మేరకు రేకులను అందుబాటులో ఉంచేలా చర్యలు సింగరేణి సీఎండీ. ఎన్. బలరాంకు,దక్షిణ మధ్య రైల్వే జీఎం. అరుణ్ కుమార్ జైన్ హామీ. సింగరేణి భవన్,డిసెంబరు, 21, 2024 రానున్న రోజుల్లో..థర్మల్ కేంద్రాల్లో బొగ్గు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో,బొగ్గు రవాణా సాఫీగా సాగేందుకు ఇకపై రోజుకు కనీసం 40 రేకులను అందుబాటులో ఉంచాలని, సింగరేణి సీఎండీ.ఎన్.బలరామ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం. అరుణ్ కుమార్ జైన్ ను కోరారు.దీనిపై దక్షిణ మధ్య రైల్వే జీఎం.అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందించారు.రైల్ నిలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సీ.ఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ. సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయడం కోసం, రోజుకు 40 రేకుల అవసరం ఉందన్నారు.దక్షిణ మధ్య రైల్వే జీఎం.అరుణ్ కుమార్ జైన్ స్పందిస్తూ.. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి, దక్షిణ మధ్య రైల్వే ఎన్నో ఏళ్లుగా సమన్వయంతో సేవలు అందిస్తున్నాయని,ఇకపైనా డిమాండ్ మేరకు రేకులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సింగరేణి జీఎం.(మార్కెటింగ్)రవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తెలంగాణ ఆహారోత్సవం





**అగ్నిధార న్యూస్ మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా భీమిని మండలం ఎంపిపిస్ కొత్తగూడ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో తెలంగాణ ఆహారోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వండి విద్యార్థులకు తీసుకువచ్చారు. పాఠశాల ప్రధనోపాధ్యాయురాలు మహేశ్వరి "మై హాండ్ ఇన్ స్కూల్ డెవలప్మెంట్ (పాఠశాల అభివృద్ధిలో నా హస్తం)" అనే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల అభివృద్ధి కి అందరు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు కావాలని కోరగా వారు అందరూ కూడా వెంటనే మా వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలుపడం హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి మంచి పనికి శ్రీకారం చుట్టిన ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరినీ కొత్తగూడ గ్రామ ప్రజలు , విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# డయల్ 100 కాల్స్ పై ఆలసత్వం వద్దు

**సిద్దిపేట :** పోలీస్ కమిషనర్ డా. బి. అనురాధ పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమిక్ష సమావేశం నిర్వహించి 2023, 2024 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల గురించి ఎసిపి, సిఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. 2023 సంవత్సరంలో పెండింగ్ ఉన్న కేసులలో అన్ని కోణాలుల్లో పరిశోధన చేసి కేసులు ఫైనల్ చేయాలని సూచించారు. గర్ల్స్, ఉమెన్ మిస్సింగ్ కేసులలో దరఖాస్తు రాగానే వెంటనే కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించి, వెంటనే ట్రేస్ ఔట్ చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులలో ఎలాంటి అలసత్వం వహించవద్దు. సిఈ ఐఆర్ లో ట్రేస్ అవుట్ అయినా మొబైల్ ఫోన్లను వెంటనే రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించాలని సూచించారు. యంఓ అపెండర్స్, సస్పెక్ట్స్, కేడీలు, డిసీలు, రౌడీలు, పై నిఘా ఉంచి వారి యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. డయల్ 100 కాల్ రావాలి వెంటనే రెస్పాండ్ అయి స్వార్థమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డయల్ 100 కాల్స్ పై అలసత్వం వహించవద్దని అన్నారు.నాన్ బేలబుల్ వారెంట్ ఎన్ బి డబ్ల్యు ఎస్, సాధ్యమైనంత త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల గురించి రోడ్ సేఫ్టీ కమిటీ, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ లో ఎఫ్ఐఆర్, సిడిఎఫ్, పార్ట్ వన్, పార్ట్ టూ, రిమాండ్ డైరీ, చార్జిషీట్ సీసీ నెంబర్ డాటా ను ఏరోజు కారోజు ఎంట్రీ చేయాలి. పెండింగ్ ఉన్న దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో కేసులలో ఉన్న క్రైమ్ వెహికల్ కోర్టులో కేసు డిస్పోజల్ కాగానే వెంటనే సంబంధిత యజమానికి అందజేయాలని సూచించారు. వాహనాలు అప్పగించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించాలి, పోలీస్ అధికారులు సిబ్బంది గ్రామాలను సందర్శించినప్పుడు కమ్యూనిటీ పోలీసు ఇందులో భాగంగా అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్ ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, అభయ యాప్, సామాజిక రుక్మతల గురించి కాలేజీలలో స్కూల్లలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పేకాట, జూదం, తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణిచివేయాలి. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి. ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలి. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు, విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఏసిపి మధు, గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి, హుస్నాబాద్ ఏసీపి సతీష్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఇన్స్పెక్టర్ కమలాకర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పథమంగా మరకత కార్యసిద్ధి పంచముఖి ఆంజనేయ స్వామికి దేదీప్యమాన పూజలు

**రంగారెడ్డి చేవెళ్ల నియోజకవర్గం** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం సింగాపురం గ్రామంలో అ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన జరిగి నేటికీ 41 రోజు ఆయిన సందర్భాన్ని పురస్కరించుకొని సింగాపురం గ్రామంలో ప్రత్యేక పూజలు పంచామృత అభిషేకాలు సుగంధ పరిమళాల అభిషేకాలతో పాటు అన్నదానాలు పారాయణాలు జరిప్తమానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి బహుశా తెలంగాణ రాష్ట్రంలోనే పంచముఖ మరకత ఆంజనేయస్వామి విగ్రహం అనేది రంగారెడ్డి డిస్ట్రిక్ట్ శంకర్ పల్లి మండలము సింగపూర్ గ్రామంలోనే ఉండడం విశేషం.

# క్రీడలకు అధిక ప్రాధాన్యత

**అగ్ని ధార న్యూస్ సుల్తానాబాద్** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ పెద్దపల్లి జిల్లాస్థాయి టోర్నమెంట్స్ శనివారం సాయంత్రం ముగిసాయి. వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలో గెలుపొందిన జట్టులకు, విజేతలకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామస్థాయిలో నైపుణ్యం కలిగి ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకే సీఎం రేవంత్ రెడ్డి సీఎం కప్ టోర్నమెంట్స్ ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇది క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇటీవల శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నామని చెప్పారు. క్రీడాకారులకు



పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్ లో క్రీడారంగం అభివృద్ధికి మునుముందు కూడా తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జ విజయ్ రావు,డివైస్ఓ సురేష్, ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడీవో, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, పిఈటిలు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో మాల జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవిడ్, రేణు రెడ్డి, ముకురాల నరేందర్ గౌడ్, యువజన కాంగ్రెస్ తలకొండపల్లి మండల అధ్యక్షులు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ బాలస్వామి, మట్ట అంజయ్య, చొప్పరి శీను, పరమేష్ ముత్యాలు, నవీన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ చంద్రమౌళి ,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేర చిరు వ్యాపారులు జీవితాలు రోడ్డునా పడేసారు.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** అభివృద్ధి పేర చిరు వ్యాపారులు జీవితాలు రోడ్డునా పడేసారని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్ధానిక ఓల్డ్ అశోక్ టాకిస్, సమీపంలో కుల్చివేతకు గురైనా చిరు వ్యాపారుల యాజమానలకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సంఘీబావంతెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.చిరు వ్యాపారులు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారుల కు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండం కుల్చడం దారుణం అన్నారు. సింగరేణి స్ధలంను లీజు తీసుకుని కొంత ఓల్డ్ అశోక్ దియ్షెటర్ నడించారన్నారు. ఎమ్మెల్యేగా మాక్కాన్ సింగ్ గెలిచిన తర్వాత ఓల్ ఆశోక్ దియేటర్ కుల్చివేశారన్నారు. లీజుదారుకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అస్తులను కుల్చవేయడం ఎంటని ప్రశ్నించారు.ఈ స్ధలంలో దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్న వారి జీవనోపాధిని దెబ్బతీసారన్నారు. ఈ కార్యక్రమం లో మూల విజయ రెడ్డి, నూతి తిరుపతి, బోడ్డుపల్లి శ్రీనివాస్ ,వెముల అశోక్ కొమ్మ కుమార్ యాదవ్ మరియు యూట్యూబ్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీ విద్యార్థులకు పారామీటర్లో ఉద్యోగాలు



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని/ కరీంనగర్ జిల్లా** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రంలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఎస్ఎస్ సి జిడి పారామెడికల్ వివిధ విభాగాల్లో లో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం జరిగిందని వారిని కళాశాల ప్రాంగణంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి డీన్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులను ఘనంగా సన్మానించడం జరిగింది. తిమ్మాపూర్ సిఐ స్వామి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో ఎలా ఉండాలి అని దిశా నిర్దేశం మిగితా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని విద్యార్థులకు కోరారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి ఏజీఎం వర్కోలు శ్రీనివాస్ పి ఓ మహిపాల్ రెడ్డి ఇంచార్జ్ రామకృష్ణ సందీప్ తిరుపతి విద్యార్థుల విద్యార్థులు పాల్గొన్నారు.

## మర్రిజంగిరెడ్డి కి ఘన నివాళులు అర్పించిన నిరంజన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** నాగర్ కర్నూలు మాజీ ఎం.ఎల్. ఎ మర్రి.జనార్ధన్ రెడ్డి తండ్రి మర్రిజంగిరెడ్డి అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి అంత్యక్రియలు తిమ్మాజీపేటా మండలం జంగిరెడ్డి స్వగ్రామం నేరళ్ళ గ్రామములో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి వారి పార్థివదేహాన్ని కి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి మర్రిజమునా జనార్ధన్ రెడ్డి దంపతులను పరామర్శించారు.

అగ్నిధార

# ఈ అందాల భామ టాలీవుడ్‌కు దూరం అవుతుందా?



చాలా మంది హీరోయిన్ తెలుగులో సినిమాలు చేసి ఆపై తమిళ్, హిందీ భాషల్లోనూ అవకాశాలు అందుకొని స్టార్స్ గా మారారు. కాగా కొంతమంది బాలీవుడ్ కు చెక్కేశాక తెలుగులో పూర్తిగా సినిమాలు తగ్గించారు. రీసెంట్ డేస్ లో రకుల్, తమన్నా కూడా బాలీవుడ్ పై ఎక్కువగా దృష్టి పెడుతూ టాలీవుడ్ లో జోరు తగ్గించారు. అంతకు ముందుకు కూడా చాలా మంది అందాల భామలు టాలీవుడ్ వదిలి బాలీవుడ్ కు వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ లిస్ట్ లోకి మరో ముద్దుగుమ్మ చేరుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది ఆ అమ్మడు. యంగ్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. కానీ ఇప్పుడు అంతగా అవకాశాలు అందుకోలేకపోతుంది. దాంతో బాలీవుడ్ కు చెక్కేయాలని డిసైడ్ అయ్యింది. ఇంతకూ ఆమె ఎవరంటే..

హీరోయిన్ గా సక్సెస్ కావడం అంత ఈజీ కాదు. ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ ఇప్పటికీ స్టార్ డమ్ కోసం ఎదురుచూస్తున్నారు. అవకాశాలు వస్తున్న అదృష్టం కలిసి రాని భామల్లో రాశి ఖన్నా ఒకరు. ముందుగా ఈ చిన్నది బాలీవుడ్ లో సినిమాలు చేసింది. ఆతర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు. దాంతో ఇటీవలే బాలీవుడ్ లో ఓ వెబ్ సిరీస్ చేసింది. దాంతో ఇప్పుడు బాలీవుడ్ పైనే ఈ చిన్నది ఫఫోకస్ పెడుతుంది. దాంతో రాశీ ఖన్నా టాలీవుడ్ కు దూరం అవుతుంది అని అంటున్నారు కొందరు అభిమానులు. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఫోటో షూట్స్ చేస్తున్నారు. ఇదంతా బాలీవుడ్ లో అవకాశాల కోసమే అని అంటున్నారు. మరి నిజంగానే ఈ అమ్మడు టాలీవుడ్ కు దూరం అవుతుందా లేదా అనేది చూడాలి.





# మోస్ట్ పాపులర్ ఇండియన్ సెలబ్రిటీలుగా ప్రభాస్, సమంత

ఆర్మాక్స్ అత్యంత ప్రేక్షకాదరణ పొందిన నటీనటుల జాబితాను ప్రకటించింది. ఇందులో టాలీవుడ్ నుంచి ప్రభాస్ మోస్ట్ పాపులర్ నటుడిగా నిలవగా.. హీరోయన్లలో సమంత టాప్‌లో నిలిచింది. ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ ప్రతినెల దేశంలోని సెలబ్రిటీల గురించి సర్వే నిర్వహించి.. టాప్ పొజిషన్‌లో ఉన్న సెలబ్రెటీల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నవంబర్ నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ మేల్, ఫిమేల్ స్టార్స్ సర్వే జాబితాను ఆర్మాక్స్ వెల్లడించింది. ఈ లిస్ట్‌లో ప్రభాస్ టాప్ ప్లేస్‌లో నిలిచాడు. ప్రభాస్ తర్వాత మోస్ట్ పాపులర్ నటులలో తమిళ నటుడు దళపతి విజయ్, అల్లు అర్జున్, షారుక్ ఖాన్, ఎన్టీఆర్, అజిత్ కుమార్, మహేశ్ బాబు, సూర్య, రామ్ చరణ్, అక్షయ్ కుమార్‌లు ఉన్నారు.

# నేను సోలోగా వచ్చి నాలుగు ఏండ్లు అవుతుంది



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. రామ్ చరణ్ - శంకర్ - దిల్ రాజు కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నేడు అమెరికాలోని టెక్సాస్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం ఒక ఇండియన్ సినిమాను అందులో ఒక తెలుగు సినిమాను ఇండియాలో కాకుండా వేరే దేశంలో నిర్వహిస్తున్నారు. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా.. ఇప్పటికే నటుడు రామ్ చరణ్‌తో పాటు నిర్మాత దిల్ రాజు, దర్శకుడు శంకర్‌లు డల్లస్‌లో ల్యాండ్ అయ్యారు. రామ్ చరణ్ అమెరికాకు చేరుకోగానే మెగా అభిమానులు నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. అయితే ప్రీ రిలీజ్ వేడుకకు ముందు ప్రెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో రామ్ చరణ్ మాట్లాడుతూ.. తన సినిమా సోలోగా వచ్చి నాలుగు ఏండ్లు అవుతుందని తెలిపాడు. "నేను సోలోగా వచ్చి నాలుగు ఏండ్లు అవుతుంది. చివరిగా నా బ్రదర్ తారక్‌తో కలిసి ఆర్ఆర్ఆర్ సినిమా చేశాను. ఇప్పుడు వస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఈ సినిమాతో మిమ్మల్ని అస్సలు నిరాశపరచము. అది మనందరికీ అద్భుతమైన సంక్రాంతి అవుతుందంటూ" రామ్ చరణ్ చెప్పుకోచ్చాడు.



# 'బలగం' తర్వాత నాపై ఒత్తిడి పెరిగింది

చిన్నసినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం 'బలగం' తెలంగాణలోని కుటుంబ మూలాలు, భావోద్వేగాల నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కమెడియన్ వేణు ఎల్దండి దర్శకత్వం (డెబ్యూ) వహించిన ఈ చిత్రంలో ప్రియదర్శి కావ్య కల్యాణ్ రామ్ హీరోహీరోయిన్లుగా నటించగా.. వేణు ఎల్దండి, మురళీధర్ గౌడ్, జయరామ్, రూప, రచనా రవి కీలక పాత్రల్లో కనిపించారు. అయితే ఈ సినిమా అనంతరం అందరిచూపు దర్శకుడు వేణుపై పడిన విషయం తెలిసిందే. బలగం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వేణు ఎలాంటి సినిమా తీయబోతున్నాడు అని సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తుండగా.. తన తర్వాతి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' అంటూ అందరికి షాక్ ఇచ్చాడు. అయితే 'ఎల్లమ్మ' అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుంది ఎవరు లీడ్ రోల్ చేయబోతున్నారు అనేది సస్పెన్స్‌గా మారింది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు దర్శకుడు వేణు. మీడియాతో మాట్లాడుతూ.. "బలగం సినిమా హిట్ అయిన తర్వాత నా బాధ్యత మరింత పెరిగింది. అయితే అందరూ అనుకున్నట్లే బలగం తర్వాత వేణు ఏం తీస్తున్నాడు అనే ఒత్తిడి అయితే ఉంది. ఆ ప్రెషర్‌నే బాధ్యతలాగా ఫీల్ అవుతున్నాను. ఈ సినిమా వలన అందరూ ఫస్ట్ నన్ను ప్రేమించారు. ఇప్పుడు గౌరవిస్తున్నారు. దీన్ని మళ్లీ నిలుపుకోవాలని గ్యాప్ తీసుకుంటున్నాను. అందుకే ఎల్లమ్మ కథ లేట్ అవుతుంది. ఈ సినిమాలో కల్చర్ ఉంటది.. ఎమోషన్ ఉంటుంది. ఈ సినిమాపై న్యూ ఇయర్‌లో అప్‌డేట్ ఇస్తాము. దిల్ రాజు గారు ఈ సినిమాను నిర్మించబోతున్నారు" అంటూ వేణు చెప్పుకోచ్చాడు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com